# నమస్తే తెలంగాణ
## వరంగల్ హనుమకొండ
5 | శనివారం 18 మే 2024 | WARANGAL HANUMAKONDA



మల్లూర్ మండలం తాడిచర్ల కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం


వెంకటాపూర్ మండలంలోని కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోయిన వడ్లు

# రైతు కష్టం.. వర్షార్పణం



## మహబూబాబాద్ జిల్లా..

మహబూబాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు కేంద్రాలకు తీసుకొస్తే రోజుల తరబడి కొనుగోలు చేయకపోవడంతో ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. భారీ వర్షం కురిసి వడ్లన్నీ తడిసిపోయాయి. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. బయ్యారం మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి పందిపంపుల వాగు, మసివాగు ప్రవహిస్తుండడంతో బయ్యారం పెద్దచెరువులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. డోర్నకల్ మండలంలో కురిసిన భారీ వర్షంతో పాటు పైనుంచి వస్తున్న వరదతో పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి వరదనీరు వచ్చి చేరుతుంది. జిల్లా సగటు వర్షపాతం 70.8 మిల్లీమీటర్లుగా నమోదైంది.



## ఉమ్మడి జిల్లాలో దంచికొట్టిన వాన

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- వరదలో కొట్టుకుపోయిన వడ్లు
- ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు శ్రమించిన రైతులు
- సకాలంలో కొనకపోవడం వల్లే నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- గార్ల మండలంలో రాకపోకలు బంద్

నమస్తే నెట్‌వర్క్, మే 17: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షంతో రైతు కష్టం వర్షార్పణం అయ్యింది. గురువారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు, శుక్రవారం కురిసిన వానతో అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొస్తే.. సకాలంలో కొనకపోవడం, సరైన వసతులు కల్పించకపోవడంతో ఎక్కడికక్కడ తడిసిపోయింది. అనేక చోట్ల వరదలో వడ్లు కొట్టుకుపోయాయి. వారం పది రోజులుగా కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబోస్తూ కాపాడుకున్న రైతులు, ఇప్పుడు వాన నుంచి రక్షించుకునేందుకు తిప్పలు పడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తమకీ దుస్థితి వచ్చిందని, తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. కురవి మండలం తాట్యాతండా వద్ద రైల్వేగేటు వద్ద రోడ్డుపై భారీగా వర్షం నీరు చేరడంతో రోడ్డుకు గండిపెట్టారు. గార్ల మండలం రాంపూర్ చెక్‌డ్యాం నుంచి వరద పొంగిపొర్లడంతో 15 గ్రామాలకు మండల కేంద్రానికి రాకపోకలు బందయ్యాయి.



### ఇప్పటికే మొలకలొస్తున్నాయి..

నెల రోజుల కింద ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొచ్చినం. వానలు పడుతున్నా ఎవ్వలు దిక్కులేరు. తేమ వస్తలేదని వంకలు పెడుతున్రు. అధికారులు వచ్చుడు లేదు. వడ్లను చూసుడు లేదు. ఏం చూడకుండానే తేమ ఎక్కువుందని అంటున్రు. తెలిసిన వాళ్ల వడ్లు కొంటాన్రు. రెండు రోజులు ఎండబోసుడుతోనే మల్ల వాన పడ్తాంది. ఇన్ని రోజుల నుండి ఫోన్ చేస్తే రాలేదు. ఇప్పుడు ఫోన్ చేస్తే రాత్రి వానే పడే తేమ శాతం ఏడ వస్తది మళ్ల ఎండబోయి అంటున్రు. వానకు వడ్లన్నీ తడిసినయ్. ఇప్పటికే మొలకలొస్తున్నాయి.

**– మాడబోయిన దేవేందర్, రైతు, జంగాలపల్లి**


హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి గ్రామంలో తడిసిన మక్కజొన్న కంకులను ఆరబెడుతున్న రైతులు


భూపాలపల్లిలోని కాశీంపల్లిలో నేలకొరిగిన వరిపైరు

## భూపాలపల్లి జిల్లా..

జయశంకర్ భూపాలపల్లి, మే 17 (నమస్తే తెలంగాణ): యాసంగి వడ్లు ఇప్పటి వరకు అధికారులు కేవలం 16,204 టన్నులే కొనుగోలు చేశారు. సుమారు లక్ష టన్నులు లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటి వరకు 116 కేంద్రాల ద్వారా 16,204 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా 73 కేంద్రాలను ప్రారంభించలేదు. ఈ ధాన్యాన్ని కాటారం, కొయ్యూరు, గొర్లవీడు, చిట్యాల, గణపురానికి చెందిన ఆరు మిల్లులతో పాటు వరంగల్‌లోని మిల్లులకు సరఫరా చేశారు. ఇంకా కొనుగోలు కేంద్రాల్లో నాలుగు వేలకు పైగా టన్నుల ధాన్యం ఉండగా, ఇంకా వస్తోంది. మరో పదిహేను రోజుల్లో ధాన్యం మొత్తం కల్లాల్లో నుంచి లిఫ్టు చేయాల్సి ఉంది. వర్ష ప్రభావం పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ఎక్కడి ధాన్యం అక్కడే ఉంటోంది. జిల్లాలో ఇంకా 80 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉంది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు కల్లాల్లో ధాన్యం తడిసిపోగా గురువారం కురిసిన వర్షానికి కేంద్రాలు నీటిమయమయ్యాయి. శుక్రవారం వర్షం ఏకధాటిగా కురుస్తూనే ఉంది. కేంద్రాల్లో రైతులు ధాన్యం కాపాడుకునేందుకు అవస్థలు పడుతూనే ఉన్నారు.


కాశీంపల్లిలో నీటి నుంచి ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

## ములుగు జిల్లా..

ములుగు, మే17(నమస్తేతెలంగాణ): అధికారులు తేమ శాతం పేరుతో పెట్టిన కొర్రీలతో 20 రోజులుగా రైతులు ధాన్యాన్ని ఆరబోశారు. గురువారం రాత్రి నుంచి వర్షం కురిసి వడ్లు నీటి పాలయ్యాయి. నిబంధనల ప్రకారం తేమ శాతం రావడం లేదంటూ కేంద్రాల నిర్వాహకులు వంకలు చెప్పగా రైతులు చేసేదేమీ లేక ధాన్యాన్ని ఆరబోయగా వరుణుడి పాలైంది. రాత్రి నుంచి ధాన్యం రాసులపై పరదాలు కప్పుతూ వర్షానికి తడుస్తూ రైతులు కల్లాల వద్ద ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్తాల్లో నింపిన ధాన్యం సైతం తడిసిపోవడంతో మళ్లీ ఆరబెట్టారు. ములుగు, గోవిందరావుపేట, వెంకటాపూర్, మంగపేట, ఏటూరునాగారం, ములుగు, వాజేడు, వెంకటాపురం(నూగూరు), కన్నాయిగూడెం మండలాల్లో రైతుల ధాన్యం తడిసి ముద్దయ్యింది.


వెంకటాపూర్‌లో నేలకొరిగిన వరి


హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి గ్రామంతో తడిసిన వడ్ల బస్తాలు


హసన్‌పర్తి మండలంలో వడ్లను ఆరబెడుతున్న రైతు

## హనుమకొండ జిల్లా..

హసన్‌పర్తి మండలం రెడ్డిపురం, వంగపహాడ్, బైరాన్‌పల్లి, సిద్ధారెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి, నడికూడ మండలం కంఠాత్మకూర్ తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసిపోయాయి. మక్కజొన్న గింజలు తడవగా, వాటిని ఆరబోసేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు.

---

## సూపర్ స్పెషాలిటీ పనుల్లో వేగం పెంచాలి

{ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి }

- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ
- కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ, ఎంజీఎం దవాఖానల పరిశీలన

పోచమ్మమైదాన్, మే 17 : వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని హాల్‌లో రాష్ట్ర వైద్య కుటుంబ సంక్షేమ కమిషనర్, టీఎస్ఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్, జాయింట్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి దవాఖాన పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. నగరంలోని ఎంజీఎం, ప్రభుత్వ నేత్ర వైద్యశాల, హనుమకొండ ప్రసూతి దవాఖాన, ప్రభుత్వ టీబీ హాస్పిటల్‌లో ప్రజలకు అందిస్తున్న విభాగాలు, అందుబాటులో ఉన్న పరికరాలు, సూపర్ స్పెషాలిటీ దవాఖానలో మార్పు చేసే విభాగాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ దవాఖానతో పాటు ఎంజీఎం దవాఖానను ఉన్నతాధికారులు సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. క్యాథలాబ్, డయాలసిస్ విభాగాలను పరిశీలించారు. ఎంజీఎంలోని క్యాజువాలిటీ, పీడియాట్రిక్ వార్డు, సిటీ స్కాన్, ఎక్స్ రే మిషన్ విభాగాలను సందర్శించారు. కాగా 'నమస్తే తెలంగాణ'లో శుక్రవారం 'ఇరుకైన క్యాజువాలిటీలో ఇక్కట్లు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైన రోజే రాష్ట్ర ఉన్నతాధికారులు వచ్చి దవాఖానను నేరుగా పరిశీలించడం గమనార్హం. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగేంద్ర, ఈఈ జితేందర్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ ఎస్ఈ దేవేందర్, ప్రభుత్వ దవాఖానల సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, నిర్మల, విజయలక్ష్మి, గిరిధర్‌రెడ్డి, శ్రవణ్, కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, వైస్ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు ఎన్‌హెచ్ఎం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు రెండు నెలల నుంచి రావాల్సిన వేతనాలను చెల్లించే ఏర్పాట్లు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రామ రాజేశ్ చెప్పారు.


సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ

---

## విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్
- గణపురం పీహెచ్‌సీ తనిఖీ
- చెత్తకుప్పలో మందులు వేయడంపై సీరియస్
- దవాఖానకు సకాలంలో రాని వైద్యసిబ్బందిపై ఆగ్రహం

నమస్తే ఎఫెక్ట్

గణపురం, మే 17 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని డీఎంహెచ్‌వో మధుసూదన్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం 'నమస్తే'లో 'చెత్త కుప్పలో ఔషధాలు' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. దీనికి స్పందించిన ఆయన గణపురం పీహెచ్‌సీని సందర్శించారు. బయోవేస్ట్, కాలం చెల్లిన మందులను చెత్త కుప్పలో వేసి కాల్చి వేయడంపై వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని కాల్చడం వల్ల విషపూరితమైన వాయువులు వెలువడుతాయన్నారు. బయో వేస్టేజీని దవాఖానలో ఏర్పాటు చేసిన కుండీలో వేస్తే సంబంధిత కాంట్రాక్టర్లు వాటిని తీసుకెళ్తారన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి వెనకాల పడేసిన మందులను ఆయన గ్రామ పంచాయతీ సిబ్బందితో తీయించారు.


ఔషధాలు పడేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

### సమయపాలన పాటించని వైద్యురాలిపై ఫైర్

దవాఖాన తనిఖీకి వచ్చిన సమయంలో వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకపోవడంపై డీఎంహెచ్‌వో ఫైర్ అయ్యారు. సమయపాలన పాటించడంతో పాటు దవాఖానకు వచ్చే రోగులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. పేదలే ఎక్కువగా వస్తారని వారికి అవసరమైన వైద్య సేవలందించడంతో పాటు సరైన మందులు ఇవ్వాలని ఆదేశించారు.

---

## అంగన్‌వాడీ టీచర్ హత్య కేసు నిందితుల అరెస్ట్

### బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్న, పోలీసులు

తాడ్వాయి, మే 17 : అంగన్‌వాడీ టీచర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతోపాటు దోచుకున్న బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రవీందర్ కేసు వివరాలను వెల్లడించారు. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన రడం సుజాత మండలంలోని కాటాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో పదేళ్లుగా టీచర్‌గా పనిచేస్తున్నది. ఈ నెల 14న విధులకు హాజరై ఇంటికి వెళ్లే క్రమంలో బస్ మిస్సు కావడంతో బస్టాండ్‌లో వేచి ఉన్నది. ఈ క్రమంలో ఆమెకు పరిచయం ఉన్న ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన ఆకుదారి రామయ్య బైక్‌పై తాడ్వాయికి బయలుదేరింది. ఆమె వద్ద ఉన్న బంగారాన్ని దోచుకునేందుకు ముందే పథకం పన్నిన రామయ్య అదే గ్రామానికి చెందిన పగిడి జంపయ్యను నీళ్ల ఒర్రె వద్ద దించి, ఆమె వద్దకు వెళ్లాడు. బైక్ నీళ్ల ఒర్రె వద్దకు రాగానే బైక్‌ను నిలిపివేసి సుజాతను బలవంతంగా అడవిలోకి లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. మెడలో ఉన్న బంగారం తీసుకునేందుకు ప్రయత్నించగా, ఆమె ప్రతిఘటించడంతో జంపయ్య మొదటగా బండరాయితో తలపై మోదాడు. రామయ్య ఆమె ఛాతిపై కూర్చొని గొంతు నులిమాడు. చనిపోలేదని భావించి స్కార్ఫ్‌ను మెడకు చుట్టి ఇద్దరు చెరోవైపు లాగి చంపేశారు. అనంతరం సెల్‌ఫోన్‌తోపాటు బ్యాగును పక్కనే ఉన్న వాగులో పడవేసి రొయ్యూరు గ్రామానికి వెళ్లిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.


సుజాత హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్

## భరోసా కేంద్రం సిబ్బందికి సీపీ అభినందన

సుబేదారి, మే17 : వరంగల్ పోలీసు కమిషనరేట్ భరోసా కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు బాగుందని సీపీ అంబర్ కిశోర్ ఝా ప్రశంసించారు. శుక్రవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో భరోసా కేంద్రం అధికారులు, సిబ్బందికి ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కేంద్రం బాసటగా నిలుస్తోందన్నారు. ఈ మేరకు భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ అర్షం సువర్ణ, ఎస్సై శ్రావణి, సిబ్బంది నీరజ, నవ్య, సాగరిక, శ్రావణి, సుమలత, పవిత్ర, మౌనికను అభినందించారు.


సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సీపీ